సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

పరదేశి అమ్మవారి సారె ఊరేగింపు



పరదేశి అమ్మవారి సారె ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

మధురవాడ: మధురవాడ, నగరంపాలెం గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పరదేశి అమ్మవారికి శ్రావణ మాసం తొలి మంగళవారం సందర్భంగా నగరంపాలెం గ్రామ ప్రజలు సారె సమర్పించారు. అయోధ్యనగర్‌లో గల అమ్మవారి గుడికి గ్రామానికి చెందిన మహిళలతోపాటు పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాట నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మందుగుండు సామగ్రితో వివిధ రకాల వంటకాలు, పండ్లు, పువ్వులు, ఇతర పూజా సామగ్రితో ర్యాలీగా వెళ్లి అమ్మకు సారె సమర్పించారు.

ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలి

మధురవాడ: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తోందని, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలు మల్లయ్యపాలెం, అయోధ్యనగర్ పరిసర ప్రాంతాల్లో పంచిపెట్టారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సత్యనారాయణ, జి.వేలంగిణిరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.


మరిడమ్మకు ఆభరణాలు బహూకరణ



మరిడమ్మకు ఆభరణాలు అందిస్తున్న దాతలు

భీమునిపట్నం: స్థానిక నాగవంశీయుల ఆరాధ్య దైవం మరిడమ్మకు కాళ్ల అప్పలసామి మాస్టారు జ్ఞాపకార్థం ఆయన కుమారులు కాళ్ల అప్పల నాగేశ్వరరావు, కాళ్ల గురునాథరావు రూ.లక్ష విలువ చేసే వడ్డాణం, హారం కుటుంబ సభ్యులతో కలిసి అందించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ అమ్మవారికి తమ వంతుగా వీటిని అందించామని, రాబోయే రోజుల్లో ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. రాష్ట్ర నాగవంశ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, కంటుభుక్త ముత్యాలరావు, బోని సంజీవరావు, కనకల అప్పలనాయుడు, మొకర శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



ట్రోఫీ తీసుకుంటున్న భీమిలి కేజీబీవీ విద్యార్థినులు

భీమునిపట్నం: భీమిలి కస్తూర్బా గాంధీ విద్యాలయ బాలికల జట్టు ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచింది. రెండు రోజుల క్రితం కర్నూలులో అండర్ - 17 రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. అందులో 20 జట్లు పాల్గొనగా ఫైనల్ పోటీల్లో భీమిలి జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగాకుమారి విద్యార్థినులను మంగళవారం పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంకా మరిన్ని పోటీల్లో పాల్గొని గెలుపొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు

భీమిలి

9493185214

ప్రారంభానికి నోచుకోని టాయిలెట్లు



మజ్జివలసలో నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లు

- స్వచ్ఛభారత్‌లో భాగంగా మజ్జివలస, శింగనబందలో నిర్మాణం
- వినియోగంలో లేక స్థానికులకు ఇబ్బందులు



శింగనబందలో తుప్పలతో అడవిని తలపిస్తున్న టాయిలెట్లు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస పంచాయతీలో స్వచ్ఛభారత్‌లో భాగంగా 2015లో నిర్మించిన టాయిలెట్లు ప్రస్తుతం అక్కడి జుగుప్సాకరమైన వాతావరణంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. అలాగే శింగనబంద పంచాయతీలో 2017లో నిర్మించిన టాయిలెట్లు మినీ అడవిని తలపిస్తున్నాయి. ఈ రెండు పంచాయతీల్లో లక్షలాది రూపాయల ప్రజాధనం, లబ్ధిదారుల వాటా కలిపి నిర్మించిన టాయిలెట్లు ఇప్పటి వరకూ ప్రారంభానికి నోచుకోకపోవడం విశేషం. దీంతో ఇప్పటికీ వ్యక్తిగత టాయిలెట్లు లేని ప్రజలు లింగభేదం లేకుండా బహిర్భూమిగా చెరువులు, వ్యవసాయ భూములను ఆశ్రయిస్తుండడం బాధాకరం. ఈ రెండు పంచాయతీల్లో టాయిలెట్లు వినియోగంలో లేకపోవడంతో పాటు అక్కడ లెక్కలేనన్ని విష పురుగులు తిష్టవేసుకుని ఉండటంతో పరిసరాల్లో నివసిస్తున్న వారు నిత్యం ఆందోళనతో సతమతమవుతున్నారు. అప్పట్లో వ్యక్తిగత టాయిలెట్లు నిర్మించుకోలేని వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేలు, లబ్ధిదారులు రూ.1500 చెల్లిస్తే కాంట్రాక్టర్లు శివారు గ్రామంలో సామూహికంగా నిర్మించారు. ఇలా నిర్మించిన వాటిలో మజ్జివలసలో పురుషులకు 10, మహిళలకు 5 యూనిట్లు నిర్మించగా శింగనబందలో 30 కుటుంబాలకు నిర్మించారు. మజ్జివలసలో రన్నింగ్ వాటర్ సమస్య కారణంతో, శింగనబందలో ఏ కారణం లేకుండానే రన్నింగ్ వాటర్, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసినా అప్పటి ప్రభుత్వం వాటిని ప్రారంభించ లేదు.

అక్కడి ప్రజలకు నిత్యం నరకయాతనే..

వ్యక్తిగత టాయిలెట్లు లేని వారు, వాటిని నిర్మించుకోవడానికి స్థల సమస్య ఉన్నవారు నిత్యం బహిర్భూమికి వెళ్లడానికి నరకయాతన అనుభవిస్తున్నారు. ఆరుబయటకు వేళగాని వేళ వెళ్లాలంటే ఈసడింపులు, విష పురుగులు, ముంపు సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో టాయిలెట్ల ఆవరణలోని తుప్పలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వాటి చుట్టుపక్కల వాతావరణం తరచూ కలుషితమవుతోంది. గతంలో మజ్జివలస సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి కొంత వరకు తన సొంత నిధులు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పుడు కూడా వీటి పునరుద్ధరణకు కాంట్రాక్టర్‌ను నియమించే పనిలో ఉన్నట్టు ఆమె తెలిపారు. ఈ రెండు పంచాయతీల్లో నిరుపయోగంగా ఉన్న టాయిలెట్లను వినియోగంలోకి తీసుకొచ్చే విషయంపై భీమిలి ఎంపీడీవో పి.వెంకటరమణను సంప్రదించగా ఈ రెండు చోట్లా టాయిలెట్ల నిర్వహణకు రన్నింగ్ వాటర్, విద్యుత్ సదుపాయం పంచాయతీలు కల్పిస్తాయన్నారు. వీటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ఆయా పాలకవర్గాలతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



వినియోగంలో లేని టాయిలెట్ల పరిస్థితి

పైప్‌లైన్లకు మరమ్మతులు ప్రారంభం



చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం వద్ద పగిలిన పైప్‌లైన్

తగరపువలస: భీమిలి జోన్ చిట్టివలసలో పైప్‌లైన్ల మరమ్మతులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. గోస్తనీ నది తీరంలోని కొండపేట పంప్‌హౌస్ నుంచి భీమిలికి తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ పలుచోట్ల లీకేజీల కారణంగా తరచూ నీరు వృథాగా పోతున్న సంగతి తెలిసిందే. ఎప్పటికప్పుడు సిబ్బంది మరమ్మతులు చేస్తున్నా ఓ కొలిక్కి రావడం లేదు. దీంతో తాగునీటి సరఫరా ఇంజినీరింగ్ సిబ్బంది మంగళవారం సాయంత్రం చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం వద్ద లీకేజీ అవుతున్న ప్రదేశాన్ని గుర్తించారు. దీంతో ఇక్కడి పైప్‌లైన్‌కు బుధవారం పూర్తి స్థాయిలో మరమ్మతులు పూర్తి చేయనున్నట్టు ఏఈ సురేష్ తెలిపారు. అలాగే గణేష్ థియేటర్ కూడలి వద్ద లీకైన ప్రాంతాన్ని కూడా గుర్తించి అక్కడ కూడా శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయనున్నట్టు వివరించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చిట్టివలస నుంచి భీమిలి వరకు పైప్‌లైన్ నిర్మాణంలో వినియోగించిన గ్లాస్ రీయిన్‌ఫోర్స్ కాంక్రీట్ పైపు చుట్టూ ఇసుక వేయకపోవడంతో తరచూ పంప్‌హౌస్ నుంచి భీమిలి బ్యాంకు కాలనీ వరకు పలుచోట్ల పైప్‌లైన్‌కు లీకేజీలు పడిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు లీకేజీలను గుర్తించి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయనుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రయాన్ - 3 సేఫ్ ల్యాండింగ్ కావాలని ర్యాలీ



ర్యాలీలో కేజీబీవీ ఆనందపురం విద్యార్థినులు



చంద్రయాన్ విజయవంతం కావాలని భీమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ఆనందపురం : శాస్త్రవేత్తలు అంతరిక్షంలోకి ప్రయోగించిన చంద్రయాన్ - 3 చంద్రునిపై సేఫ్‌గా ల్యాండ్ అవ్వాలని కోరుకుంటూ కేజీబీవీ విద్యార్థులు మంగళవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రత్యేకాధికారి చంద్రకళ మాట్లాడుతూ చంద్రయాన్ - 3 ఉపయోగాలను విద్యార్థులకు వివరించి వారిలో ఆలోచనా శక్తిని రేకెత్తించడానికి సంఘీభావ ర్యాలీ నిర్వహించామని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ సురక్షితంగా చంద్రునిపై ల్యాండ్ కావాలని ఆకాంక్షిస్తూ భీమిలి కేజీబీవీ విద్యార్థినులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గంగా కుమారి మాట్లాడుతూ ప్రపంచం మొత్తం భారత దేశం వైపు చూస్తోందన్నారు. తప్పకుండా చంద్రయాన్ ల్యాండింగ్ సవ్యంగా పూర్తవుతుందన్నారు. దీంతో మన దేశ ప్రతిష్ట మరింత ఎత్తుకు ఎదుగుతుందన్నారు. ఇటువంటి ప్రయోగాలను ఇస్రో మరిన్ని చేస్తూ గొప్ప విజయాలు అందుకోవాలని కోరారు.

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు చంద్రయాన్ - 3 ల్యాండింగ్ విజయవంతం కావాలని కోరుతూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. విద్యాలయం నుంచి పద్మనాభం జంక్షన్ వరకు నిర్వహించిన ర్యాలీలో సీఆర్‌టీలు పాల్గొన్నారు.



కృష్ణాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న కేజీబీవీ విద్యార్థినులు

ఫౌండేషన్ విత్తనాలతో వరి సాగుకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఏడీ సుబ్రహ్మణ్యం

పద్మనాభం: ఫౌండేషన్ విత్తనాలతో వరి పంట సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ చదువుల సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలో విత్తనోత్పత్తి గ్రామంగా ఎంపిక చేసిన విలాస్కాన్‌పాలెంలో మంగళవారం 25 మంది రైతులకు సాంబ మసూరి రకం ఫౌండేషన్ వరి విత్తనాలు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 25 మంది రైతులు ఫౌండేషన్ విత్తనాలతో పండించిన వరి పంటను విత్తనాలుగా మారిస్తే ఇతర రైతులకు సరఫరా చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. వరి సాగులో పురుగులు, గడ్డి నివారణకు వాడాల్సిన మందుల వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంవీఎస్ చలం, సర్పంచ్ నల్లి సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు బోని సావిత్రి, ఏఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు



వలందపేట సర్వీస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: ప్రమాదాల నివారణకు జీవీఎంసీ రెండో వార్డు వలందపేట సర్వీస్ రోడ్డులో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం స్వయంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ వేగ నియంత్రణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో కూడళ్ల వద్ద వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నాయకులు చిల్ల సూర్యనారాయణరెడ్డి, కొసన శ్రీనివాసరెడ్డి, శీరపు నరసింగరావు, కోనాడ కనకరాజు, చిల్ల సూరిదాసు, తుపాకుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థి రిత్విక్‌కు రూ.10 వేల చెక్కు అందిస్తున్న రమాదేవి

భీమునిపట్నం: స్థానిక టీజీఎం ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న పేద విద్యార్థి కాళ్ల రిత్విక్‌కు ప్రముఖ న్యాయవాది దుంపల గోపాలకృష్ణరావు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె దుంపల రమాదేవి రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా బాగా చదువుతున్న పేద విద్యార్థులకు తన వంతు సాయం చేస్తానని వెల్లడించారు. పాఠశాల డైరెక్టర్ పి.ఎ.విజయకుమారి, కరస్పాండెంట్ పి.ఎస్.చంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా పూటకూలమ్మ ఉత్సవం

పద్మనాభం: మండలంలోని కోరాడ పంచాయతీ గెద్దపేటలో మంగళవారం పూటకూలమ్మ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దొంతల, గెద్ద వారి కుటుంబ సభ్యులు ఈ ఉత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని పసుపు, కుంకుమ చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు.

మానసిక ఆరోగ్యం మహాభాగ్యం

ఏయూ క్యాంపస్: మానసిక ఆరోగ్యం కలిగి ఉండడం మహాభాగ్యమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ సైకాలజీ విభాగంలో మంగళవారం నిర్వహించిన 'అడ్వాన్సెస్ ఇన్ కాగ్నెటివ్ సైన్సెస్- బెటర్ ఫ్యూచర్ ఫర్ ఏజింగ్ అండ్ న్యూరో డెవర్స్ పీపుల్'అంశంపై జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ నేటి సమాజంలో మానవ సంబంధాలలో మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు.

సంతోషంగా జీవించడం అలవాటు చేసుకోవాలన్నారు. విదేశాల్లో వయోవృద్ధులు సైతం ఎవరిపైనా ఆధారపడకుండా స్వశక్తితో జీవించడం, పనిచేయడం స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. సమ వయస్కుల నుంచి వస్తున్న ఒత్తిడి యువతలో ఆత్మహత్యలను ప్రేరేపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి పాఠశాలలో సైకాలజీ కౌన్సెలర్ అవసరం ఉందన్నారు. కెనడాలోని ఆరెంజ్ న్యూరోసైన్సెస్ సంస్థ సీఈవో డాక్టర్ వినయ్ సింఘ్ మాట్లాడుతూ మానవ మస్తిష్కంలో ఏం జరుగుతుందో తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఏయూతో సంయుక్తంగా పరిశోధనలు జరపడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి మాట్లాడుతూ రోజూ ఆస్పత్రికి పదుల సంఖ్యలో చిన్నారులు వివిధ మానసిక సమస్యలతో వస్తున్నారని, వీరికి అవసరమైన చికిత్స అందిస్తున్నామన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యలకు మూలాలను అన్వేషించడం ఎంతో అవసరమన్నారు. విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో 14 శాతం మంది వృద్ధులు ఉన్నారని, 2030 నాటికి వారి జనాభా 30 శాతానికి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాధాకృష్ణ, విభాగ విద్యార్థులు, పరిశోధకులు, సైకాలజీ నిపుణులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

భీమునిపట్నం: స్థానిక ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం మేనేజర్ కె.దుర్గరాజు మంగళవారం తెలిపారు. చిన్న పిల్లల సమస్యలు, పెద్దవారిలో దీర్ఘకాలిక సమస్యలతోపాటు ఇతర సమస్యలకు వైద్యులు పరీక్షించి మందులు అందిస్తారని తెలిపారు. అవసరమైన వారికి స్కానింగ్ కూడా నిర్వహిస్తారని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కృషితో ఏదైనా సాధ్యమే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొమ్మాది: పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిది ఏమీ లేదని, బాల్యం నుంచే క్రమశిక్షణతో నడుచుకుంటే జీవితంలో ఏమైనా సాధించగలరని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ జి.తిరుమల ప్రసాద్ అన్నారు. పాఠశాల 36వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్పానికి వైకల్యం అడ్డురాదని, ఒక ఆశయంతో ఉన్నత శిఖరాలకు చేరుకునే విధంగా విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం ఇక్కడి రిటైర్డ్ టీచర్లు డి.ఉష, ఎస్.అంకయ్యను సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

సింహగిరిపై ఘనంగా నృసింహ హోమం



ప్రధాన కలశంతో తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: స్వాతి నక్షత్రం పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లోక కల్యాణార్థం వరాహ లక్ష్మీ నృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉదయం7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో నృసింహ హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి అక్కడ ఉన్న హోమగుండం వద్ద అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం నృసింహ హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శ్రీకాంతాచార్యులు తలపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. దేవస్థానం తరఫున ఉభయాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం అర్చకుడు పవన్‌కుమార్, వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో భ్రమరాంబ, సూపరింటిండెంట్ సునీల్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

'ఎగువపేటలో మెరైన్ వర్క్‌షాపు తొలగించండి'

తగరపువలస: భీమిలి బీచ్‌రోడ్డులో ఎగువపేట వద్ద పోలమాంబ ఆలయాన్ని ఆనుకుని నిర్మిస్తున్న మెరైన్ వర్క్‌షాపును తొలగించాలని నగరంలోని పాండురంగపురానికి చెందిన గొట్టుముక్కల లక్ష్మీ నరసింహరాజు జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం భీమిలి జోనల్ కార్యాలయం వద్ద మత్స్యకారుల పడవలు నిలుపుదల చేస్తున్నందున అక్కడే మెరైన్ వర్క్‌షాపు నిర్వహించుకోవాలన్నారు. దానికి విరుద్ధంగా సీఆర్‌జెడ్ - 1 ఏరియాలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వర్క్‌షాపును తొలగించాలని కోరారు.

సమాజంలో శాంతి స్థాపనకు కృషి

ఎంవీపీ కాలనీ: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎంవీపీ కాలనీలో నిర్వహించిన శాంతి ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఎంవీపీ కాలనీ సర్కిల్ నుంచి రైతుబజార్ వరకు జరిగిన ఈ ర్యాలీలో సంస్థ చైర్మన్, ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అశాంతి, అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సమాజంలో శాంతి స్థాపన దిశగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు మానవతా సంస్థ కృషి చేస్తోందన్నారు. విద్యార్థి దశలోనే యువతలో చైతన్యం తీసుకురావడం ద్వారా సమాజంలో విలువలను పెంచేందుకు వీలుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

చురుగ్గా పూడిక తీత పనులు



కృష్ణాపురం సాగు నీటి కాలువలో పూడిక తీస్తున్న పొక్లెయిన్

పద్మనాభం: కృష్ణాపురం సాగు నీటి కాలువలో పూడిక తీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 6 నుంచి పూడిక తీయిస్తున్నారు. పొట్నూరులోని గోస్తనీ నదికి అనుసంధానంగా ఉన్న ఆనకట్ట నుంచి కృష్ణాపురం ఎర్ర చెరువు వరకు ఎనిమిది కిలో మీటర్లు నిడివి గల ఈ కాలువలో ఇప్పటికే ఆరు కిలోమీటర్ల మేర పూడిక తీశారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తవుతాయి. కృష్ణాపురం సర్పంచ్ మొకర లక్ష్మీ భవాని, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు మొకర అప్పలనాయుడు పనులను పర్యవేక్షించారు. పూడితతీత వల్ల కృష్ణాపురంతోపాటు పద్మనాభం, ఇసకలపాలెం, అర్చకునిపాలెం, పొట్నూరు గ్రామాల్లోని 1,600 ఎకరాల వరి పంటకు సాగునీరు అందుతుంది.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న ఎంఈవో - 1 రమణ

పద్మనాభం: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో - 1 రమణ సూచించారు. మండల విద్యా శాఖ కార్యాలయంలో మంగళవారం ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుణాత్మక విద్య సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం వచ్చేటట్టు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

DOCUMENTS MISSING

I (P Surya Rao) working in Reliance Jio info Comm Ltd, while doing tower maintenance work at Bakkannapalem ORIGINAL BANK GUARANTEE ISSUANCE are misplaced with me on 09-08-2023. I did not get anywhere after I searched and traced out. Kindly help me out to get duplicate BANK GUARANTEE ISSUANCE.

The Details of BGs are as below:

S.No.	BANK GUARANTEE ISSUANCE NO	Date of Issue	Amount	Authority
1	LOBG401012305483	13-06-2023	1,17,000.00	IDFC FIRST BANK
2	LOBG401012305480	13-06-2023	4,10,000.00	IDFC FIRST BANK
3	LOBG401012305476	13-06-2023	1,42,500.00	IDFC FIRST BANK
4	LOBG401012305475	13-06-2023	67,500.00	IDFC FIRST BANK
5	LOBG401012305484	13-06-2023	5,63,000.00	IDFC FIRST BANK

If anybody found these documents please inform to P. Surya Rao, Reliance Jio Infocomm Ltd., Cell: 9700948288, 9642061188

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - దేవాదాయ ధర్మదాయ శాఖ

బహిరంగ వేలం - కం- సీల్డు టెండర్ ప్రకటన

మహారాజా అలక్ నారాయణ్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ (మాన్సాస్ ట్రస్టు)

కోట, విజయనగరం

ఆర్.సి.నెం.313/2022, తే.22.08.2023దీ

మాన్సాస్ ట్రస్టు, విజయనగరం వారికి చెంది యుండి వారి హక్కు భుక్తములోని విశాఖపట్నం జిల్లాలో ఈ దిగువ షెడ్యూల్‌లో తెల్పబడిన ప్రకారం 3సంవత్సరములకు కాలమునకు అనుభవించు లైసెన్సు హక్కునకు బహిరంగ వేలం-కం- సీల్డు టెండర్ వేయు నిమిత్తం (నాన్-ఆక్యుపెన్సీ లైసెన్సు హక్కు క్రింద) నిర్ణయించబడమైనది. సదరు వేలం పాటలను తేదీ.04.09.2023దీ ఉదయంగం.10-30ల నుండి మాన్సాస్ సంస్థ కార్యాలయము, విజయనగరం నందు బహిరంగ వేలము - కం- సీల్డు టెండరు వేయుట జరుగును.

షెడ్యూలు

బహిరంగవేలవ-కం-సీల్డు టెండరు భూమి వివరము			భూమి వివరములు	ధరావత్తు	సీల్డు టెండర్ / బహిరంగ వేలం	కాల పరిమితి
వ.నెం.	గ్రామము పేరు	సర్వే నెం				
1.	అన్నవరం గ్రామం, భీమునిపట్నం మండలం	94,95 పార్ట్ (పెద్ద తోట)	సుమారు 60 జీడి చెట్లు మరియు 400 కొబ్బరి చెట్లు ఎ.108.00సెంట్లు	1,00,000/-	తే.04.09.23దీన ఉ.గం.10-30లకు	[illegible]
2.	బోని గ్రామం ఆనందపురం మండలం	204	వ్యవసాయ భూమి (ఎ.41.50సెం.)	1,00,000/-	తే.04.09.23దీన ఉ.గం.11-30లకు	
3.	పద్మనాభం గ్రామం మరియు మండలం	MRVRR.II Memorial Junoir College Padmanabham (8గదులు) ప్రాంగణం మరియు వాటిలోగల సుమారు 70 మామిడి చెట్లు		50,000/-	తే.04.09.23దీన ఉ.గం.12-30లకు	

మిగిలిన వివరముల కొరకు కార్యానిర్వహణాధికారి, మాన్సాస్ ట్రస్టు విజయనగరం వారి కార్యాలయము పనివేళలలో తెలుసుకొనవచ్చును. ఫోన్ నెం.9491000709 / 9248348355).

గౌ॥శ్రీ పూసపాటి అశోక్ గజపతిరాజు
చైర్మన్, మాన్సాస్ ట్రస్టు

సం/-కార్యానిర్వహణాధికారి
మాన్సాస్ ట్రస్టు, విజయనగరం